సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



ఆట ఆరంభం

ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి గిరిజన బాలబాలికల గురుకులాల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 10లో



శ్రీరామ దీక్ష విరమణ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీరామ దీక్ష విరమణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
30°/ 18°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగానే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి పూట చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మ తల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

పాల్వంచ : మండలంలో కొలువుదీరి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వ హించారు. అనంతరం అర్చకులు నివేదన, హారతి సమర్పించారు. ఆ తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, కమిటీ అధ్యక్షుడు రామలింగం, సభ్యులు కిలారు నాగమల్లేశ్వరరావు, చింతా నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు. కాగా, ఆలయ ప్రాంగణంలోని ఆరో నంబర్ షాపునకు జనవరి 3న టెండర్ నిర్వహించను న్నామని, దక్కించుకున్న వారు మూడేళ్లపాటు వ్యాపారం చేసుకోవచ్చని ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

గురితప్పిన బాణం



కొత్తగూడెంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు (ఫైల్)

సింగరేణి ఎన్నికల్లో టీబీజీకేఎస్ ఘోర పరాజయం

- ఒక్క ఏరియాలోనూ దక్కని విజయం
- గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం 45
- ఈసారి కేవలం 3.47 శాతానికే పరిమితం
- నగం మేర ఫలితమిచ్చిన 'ఆత్మ సాక్షి'

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు భారత రాష్ట్ర సమితికి గట్టిషాక్ ఇచ్చాయి. సంస్థ పరిధిలో ఉన్న ఒక్క ఏరియాలోనూ ఆ పార్టీకి అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్- బాణం గుర్తు) విజయం సాధించలేదు సరికదా కనీస స్థాయిలో పోటీ కూడా ఇవ్వలేక చతికిలపడిం ది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో కుం గిపోయిన పార్టీ శ్రేణులకు రాబోయే లోక్‌సభ ఎన్నికల ముందు ఈ తాజా ఓటమి మరింత ఇబ్బం దికర పరిస్థితులను మోసుకొచ్చింది.

తిరుగులేని ఆధిపత్యం

మలిదశ తెలంగాణ ఉద్యమం సందర్భంగా 2003లో టీబీజీకేఎస్ ఊపిరి పోసుకుంది. తొమ్మిదేళ్ల తర్వాత అనూహ్యంగా 2012లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత కార్మికుల్లో పట్టు పెంచుకుంటూ వచ్చింది. 2017 ఎన్నికల్లోనూ సింగరేణిలో ఆ సంఘానికి ఎదురు లేకుండా పోయింది. టీబీజీకేఎస్‌ను నిలువ రించేందుకు సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ, కాంగ్రె స్ అనుబంధ ఐఎన్‌టీయూసీ కలిసి పోటీ చేసినా ఫలితం దక్కలేదు. ఆ ఎన్నికల్లో మొత్తంగా 45.40 శాతం కార్మికుల ఓట్లు దక్కించుకుంది. అంతేకాక సంస్థ పరిధిలో 11 ఏరియాలు ఉండగా తొమ్మిది ఏరియాలు టీబీజీకేఎస్ ఖాతాలో పడ్డాయి. దాదాపు పదేళ్లుగా గుర్తింపు సంఘంగా ఉండడంతో ఇతర సం ఘాలకు చెందిన నేతలు, కార్మికులు సైతం గులాబీ నీడలోకి చేరిపోయారు. అలా పదేళ్ల పాటు సింగరేణి లో టీబీజీకేఎస్ ఆధిపత్యం కొనసాగింది.

అనుకూలంగా లేక వాయిదాల పర్వం..

నిబంధనల ప్రకారం 2021లోనే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి. కానీ మొత్తం 11 ఏరియాల్లో టీబీజీకేఎస్‌కు అనుకూల వాతావరణం లేదనే అనుమానంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాయిదా వేస్తూ ఇప్పటివరకు నెట్టుకొచ్చింది. అయితే ఇతర సంఘాలు కోర్టును ఆశ్రయించడంతో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందే నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆ తర్వాత అసెం బ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడం, కాం గ్రెస్ గద్దెనెక్కడం చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత వెంటనే సింగరేణి గుర్తింపు ఎన్నికల పోలిం గ్ అంకం తెరపైకి వచ్చింది. దీంతో సింగరేణి ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై ఆ పార్టీ నాయక త్వం తటపటాయించింది. పోటీకి టీబీజీకేఎస్ దూరంగా ఉంటుందనే ప్రచారం జోరందుకుంది. దీంతో ఒక్కసారిగా యూనియన్ నేతల రాజీనామాల పర్వం కొనసాగింది. అన్ని ఏరియాల నుంచి కీలక నాయకులు ఐఎన్‌టీయూసీలోకి వలస బాట పట్టారు.

ఆత్మసాక్షి ఫలించిందా?

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా కల్వకుంట కవిత కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ముగిసిన వెంటనే ఈనెల 6నుంచి సింగరేణి ఎన్నిక లపై ఆమె ఫోకస్ పెట్టారు. కానీ 20వ తేదీ నాటికి పరిస్థితులు అనుకూలంగా లేవని తేలిపోయింది. దీంతో సింగరేణి ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ దూకుడును అడ్డుకునే వ్యూహాలకు పదును పెట్టారు. దీనికి తగ్గట్టే సింగరేణి ఎన్నికల్లో కార్మికులు 'ఆత్మసాక్షి'గా ఓట్లేసి టీబీజీకేఎస్‌ను గెలిపించాలని ఈనెల 22న కవిత పిలుపునిచ్చారు. ఆ పిలుపునకు తగ్గట్టుగానే టీబీజీకేఎస్ శ్రేణులు లోపాయికారిగా ఏఐటీయూసీకి మద్దతు ఇచ్చారనే ప్రచారం జరిగింది. అందువల్లే 11 ఏరియాల్లో ఆరింట విజయం సాధించినప్పటికీ ఐఎన్‌టీయూసీ చివరకు గుర్తింపు సంఘం హోదాను దక్కించుకోలే కపోయింది. ఆపరేషన్ 'ఆత్మసాక్షి' విజయానికి గుర్తుగా ఏఐటీయూసీ నిలిచింది. అదే సమయంలో టీబీజీకేఎస్ ఘోర పరాజయం మూటగట్టుకుంది.

ఘోర పరాజయం..

బుధవారం జరిగిన పోలింగ్, ఆ వెంటనే వెల్లడైన ఫలితాలు టీబీజీకేఎస్ గత చరిత్రకు మచ్చ తెచ్చే పరిస్థితిని కల్పిం చాయి. ఒక్క మణుగూరు మినహా ఎక్కడా ఆ సంఘానికి గౌరవప్రదమైన ఓట్లు రాలేదు. ఇల్లెందు ఏరియాలో ఒకటి, బెల్లం పల్లి ఏరియాలో మూడు ఓట్లు రావడం దారుణ పరాభవానికి పరాకాష్టగా నిలిచాయి. 2012 ఎన్నికల్లో మొత్తంగా 23,311 ఓట్లు సాధించిన టీబీజీకేఎస్‌కు.. 2017 ఎన్నికల్లోనూ 23,845 ఓట్లు వచ్చాయి. కానీ తాజా ఎన్నికల్లో కేవలం 1,298 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అం దులో మణుగూరులోనే అత్యధికంగా 728 ఓట్లు రాగా, శ్రీరాంపూర్‌లో 216 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఏరియాల్లో 50 లోపు ఓట్లకే ఆ సంఘ బలం పరిమితమైంది.

ఊరూరా సభల సందడి



ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డులో దరఖాస్తులు ఇచ్చేందుకు పోటీపడుతున్న ప్రజలు

- 'ప్రజాపాలన'కు పోటెత్తిన జనం
- వెల్లువెత్తిన దరఖాస్తులు

చుంచుపల్లి : ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభు త్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలకు దర ఖాస్తుదారులు భారీగా తరలివస్తున్నారు. జిల్లాలో తొలిరోజు గురువారం 83 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 23 వార్డుల్లో సభలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారు లు సభలకు హాజరు కాగా, ప్రత్యేకాధికారులు పర్య వేక్షించారు. ప్రజలు పలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు అందజేయగా, అధికారులు వారికి రసీదులు ఇచ్చారు. గ్రామ సభల్లో ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షణలో స్థానిక సీఐ, ఎస్సైలు బం దోబస్తు విధులు నిర్వర్తించారు. మొత్తంగా మొదటి రోజున ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు ముగిశాయి. మున్సిపాలిటీల పరిధిలో 6,905, గ్రామ పంచాయతీల పరిధిలో 18,182 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

విజయవంతంపై కలెక్టర్ హర్షం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాపాలన గ్రామ సభలు మొదటిరోజు విజయవంతం కావడం పట్ల కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హర్షం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఏడురోజులు కూడా కా ర్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచిం చారు. గ్రామసభల్లో దరఖాస్తులు అందించే ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తు న్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 25,087 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి దరఖాస్తులు ఉచితంగా అందజేస్తున్నా మని, ఎవరూ దళారులను ఆశ్రయించొద్దని కోరారు. దరఖాస్తు పూర్తిచేయలేని నిరక్షరాస్యుల కోసం హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ సిబ్బందే వారి దరఖాస్తులు నింపుతారని పేర్కొన్నారు. జిరా క్స్ తీయించుకునే వారి నుంచి ప్రస్తుతం ఉన్న ధరలే వసూలు చేయాలని, ఎక్కువ తీసుకున్నట్లు ఫిర్యాదు లు అందితే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. క్రిమినల్ కేసులతో పాటు జిరాక్స్ కేంద్రం అనుమతి రద్దు చేస్తామని ప్రకటించారు.

సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంఅర్బన్ : ప్రజాపాలన సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం ఆయన భద్రాచలం గ్రామ సభకు హాజరై మాట్లాడారు. ప్రతీ గడపకు సంక్షేమా న్ని అందించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్ర మాన్ని చేపట్టిందన్నారు. ప్రజలకు ఏమైనా సల హాలు, సూచనలు అవసరమైతే ఆయా కేంద్రాల వద్ద అధికారులను సంప్రదించాలే తప్ప దళారులను ఆశ్ర యించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అనిల్‌కుమార్, ఆర్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న పీఓ

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: గత విద్యా సంవత్సరంలో ఇన్ స్పైర్ మనాక్ అవార్డులకు ఎంపికైన వారు జనవరి 1 నుంచి వారి ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ సమ యంలో అప్‌లోడ్ చేసిన ప్రాజెక్టులు మాత్రమే పోటీకి పంపించాల్సి ఉంటుందని, ఒక్కో ప్రాజెక్టు విలువ రూ.5 వేలకు తక్కువ కాకుండా రూపొందిం చాలని సూచించారు. జిల్లాలో గతేడాది 81 ప్రాజెక్టు లు ఎంపికయ్యాయని, ఒక్కో ప్రాజెక్టుకు రూ.10వే లు మంజూరయ్యాయని వివరించారు. నామమా త్రంగా రూపొందించిన ప్రాజెక్టులను తిరస్కరిస్తా మని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి ఇన్‌స్పైర్ మనాక్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసు కోవాలని సూచించారు. ప్రాజెక్టులను వీడియో, ఆడియో పోటీల ద్వారా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. వీడియో 30 ఎంబీకి మించి ఉండొద్ద ని, ఆడియో 2 నిమిషాలు, నాలుగు ఫొటోలు అప్ లోడ్ చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికై న ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను గురువారం ఇంటర్ బోర్డు విడుదల చేసింది. 2024 ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్, 28 నుంచి మార్చి 19 వరకు థియరీ పరీక్షలు జరుగుతాయని డీఐఈఓ సులోచనారాణి తెలిపారు.

రాజకీయం తారుమారు

- అసెంబ్లీ రేస్‌లో దూసుకెళ్లిన కాంగ్రెస్
- ముగ్గురికి మంత్రివర్గంలో స్థానంతో రికార్డు
- ఒకే సీటుతో సరిపెట్టుకున్న 'కారు'
- వికసించని బీజేపీ, జనసేన పొత్తు.. చతికిలబడిన సీపీఎం
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మారిన రాజకీయం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది రాజకీయాలు తారుమారయ్యాయి. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. ఐదేళ్ల పాటు వెలిగిపోయిన బీఆర్‌ఎస్ పరాజయాన్ని మూటగట్టు కోగా, కాంగ్రెస్ గత వైభవాన్ని చాటుకుంది. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో ఆ పార్టీ ఎనిమిదిం ట, పొత్తులో భాగంగా సీపీఐ కొత్తగూడెం స్థానాన్ని గెలుచుకుంది. దీంతో తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన గత రెండు ఎన్నికల్లో మాదిరిగానే బీఆర్‌ఎస్ ఒకే స్థానానికి పరిమితమైంది. కానీ గత రెండు ఎన్నిక ల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడినా ఈసారి రాష్ట్రం లోనూ అధికారం కోల్పోయింది. ఇక కేంద్ర మంత్రు లు, ఉద్దండ నేతలు ప్రచారం చేసినా బీజేపీ, జన సేన పొత్తు వికసించకపోగా.. ఒంటరిగా పోటీ చేసిన సీపీఎం చతికిలబడింది. కాంగ్రెస్ అధికారం లోకి రావడంతో ఉమ్మడి జిల్లా నుంచి డిప్యూటీ సీఎంగా మల్లు భట్టివిక్రమార్క, మంత్రులుగా పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు అవకాశం దక్కడం రికార్డుగా నమోదైంది.

మెజార్టీతో కాంగ్'రేస్'

అసెంబ్లీ ఎన్నికల్లో పది స్థానాలూ లక్ష్యంగా కాంగ్రె స్ పార్టీ పావులు కదిపింది. ఈ ఏడాది జనవరి 1న బీఆర్‌ఎస్ పార్టీకి దూరమైన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జూలై 2న కాంగ్రెస్‌లో చేరారు. అదే రోజు ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ముగిసింది. ఆ తర్వాత పాలేరు టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు హస్తం గూటికి చేరారు. ఇలా కాంగ్రెస్‌కు బలం పెరగగా, ఉమ్మడి జిల్లాలో తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్, పొత్తులో భాగంగా కొత్తగూడెంలో సీపీఐ పోటీకి దిగింది. ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీ రావడంతో కేడర్‌లో జోష్ నింపిం ది. ఎక్కడా అసంతృప్తులు లేకుండా బుజ్జగించగా ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్ ఏకతాటిపై నడవడం తో ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. అంతేకాకుండా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పాలేరులో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 50 వేలకు పైగా మెజార్టీ సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఉమ్మడి జిల్లా కీలకంగా నిలిచినట్లయింది.

ముగ్గురి జోడీతో జోష్

మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వ్యూహాలు ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు దక్కేలా చేశాయి. అభ్యర్థుల ఎంపిక మొదలు అధిష్టానం సూచనలు పాటిస్తూ జిల్లా కేడర్‌ను కదం తొక్కించడమే కాక రాష్ట్రంలోని పలు స్థానాలకు వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ఉమ్మడి జిల్లాలో అనూహ్య విజయం సాధించడానికి ఈ ముగ్గురు నేతల చాణక్యం కలిసొచ్చిందనే చెప్పాలి. దీంతో ప్రభుత్వంలో ఈ ముగ్గురికీ పార్టీ అధిష్టానం పెద్ద పీట వేసింది. భట్టికి డిప్యూటీ సీఎం పదవితో పొంగులేటి, తుమ్మలకు మంత్రి పదవులు కట్టబెట్టింది. జిల్లా నుంచి ఒకేసారి ముగ్గురికి పదవులు దక్కిన చరిత్ర లేకపోగా.. వీరికి కీలక శాఖలు కేటాయించడం మరో రికార్డు.

కారుకు మళ్లీ 'సారీ'

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో కొత్తగూ డెం, 2018లో ఖమ్మం స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలవగా ఈసారి భద్రాచలం దక్కింది. అయితే, గత రెండుసార్లు ఆ పార్టీ అధికారం లోకి వచ్చింది. గత ఎన్నికల తర్వాత కాంగ్రె స్, టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ ఎస్‌లో చేరగా, స్థానిక సంస్థలు, ఎంపీ, ఎమ్మె ల్సీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ విజయబావుటా ఎగురవేసింది. కానీ ఈ ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఆ పార్టీని ఉమ్మడి జిల్లానే కాక రాష్ట్రంలోనూ దెబ్బతినడం గమ నార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ దళపతి కేసీఆర్ పది స్థానాలు కలిసొచ్చేలా తొమ్మిది చోట్ల జరిగిన సభలకు హాజరై 'గతంలో ఒక్క స్థానం వచ్చినా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేశాం.. ఈసారి మెజార్టీ స్థానాలు ఇవ్వాలి' అని కోరినా ఫలితం దక్కలేదు. ఆ పార్టీ కీలక నేత లు కేటీఆర్, హరీశ్‌రావు సైతం ప్రచారం చేసి నా ఆశించిన ఫలితం రాకపోవడం, కాంగ్రె స్‌కు మెజార్టీ సీట్లు దక్కడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు కంగుతిన్నాయి.

సీపీఐకి విజయం

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న సీపీఐ సీట్ల విషయంలో బెట్టు చేయకుండా కొత్తగూడెం స్థానం నుంచి మాత్రమే పోటీ చేసింది. ఇక్కడ బరిలోకి దిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కూనంనేని తరపున పార్టీ జాతీయ నేతలు డి.రాజా, నారాయణ తదితరులు ప్రచారం చేశారు.

సీపీఎంకు పరాభవం..

చివరి వరకు పొత్తు కోసం చేసిన యత్నాలు ఫలించ కపోవడంతో సీపీఎం ఒంటరిగా పోటీకి దిగింది. ఉమ్మడి జిల్లాలో పాలేరు నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు మరో ఏడు స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేసినా ఏ ఒక్కరికీ డిపా జిట్ రాలేదు. గత ఎన్నికలతో పోలిస్తే ఓట్ల శాతం కూడా గణనీయంగా పడిపోవడం గమనార్హం. సీపీ ఎం అభ్యర్థుల తరపున పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, త్రిపుర మాజీ సీఎం మాణిక్‌సర్కార్, పొలిట్ బ్యూరో సభ్యురాలు బృం దాకారత్ వంటి నేతలు ప్రచారం చేసినా ఫలితం కానరాలేదు.

'షో' చేసినా వికసించలే..

బీజేపీ, జనసేన పొత్తుతో ఉమ్మడి జిల్లాలో పోటీ చేశాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్య నేతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేయగా అభ్యర్థులకు ఎక్కడా డిపాజిట్లు దక్కలేదు. కనీసం ఓటు బ్యాంకు పెంచు కునేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. పలు స్థానాల్లో అటు బీజేపీ, ఇటు జనసేన అభ్యర్థులకు ఇండిపెండెంట్ల కంటే తక్కువ ఓట్లు రావడం గమ నార్హం. మొత్తంగా ఈ ఏడాది రాజకీయంలో కాంగ్రె స్ పూర్వవైభవాన్ని సంతరించుకోగా.. అన్ని పార్టీలు కొత్త సంవత్సరంలో జరిగే లోక్‌సభ ఎన్నిక లపై దృష్టి సారించాయి.

5,293 కేసులు నమోదు



- 379 చోరీ ఘటనలు.. 228 పరిష్కారం
- గతేడాది కంటే నేరాలు 0.35 శాతం ఎక్కువ
- 138 సైబర్ కేసులు.. రూ.4.76 కోట్ల మోసం
- మావోయిస్టుల కదలికలను అరికట్టాం
- ఈ ఏడాది నేర వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్



ఇయర్ రౌండప్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ వినీత్, డీఎస్పీలు

కొత్తగూడెంటౌన్: జిల్లాలో గతేడాది కంటే 2023లో నేరాల సంఖ్య, కేసులు అధికంగా నమోదయ్యా యని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. 2022తో పోలిస్తే 0.35 శాతం మేర అధికంగా నేర ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. 2022లో 5,274 కేసులు నమోదు కాగా, 2023లో 5,293 కేసులు నమోదు చేశామని వివరించారు. తన కార్యాలయం లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఇయర్ రౌండప్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనం తరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాను గం జాయి, మావోయిస్టు రహిత జిల్లాగా మార్చడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలకు రక్షణ కల్పించడమే తమ ధ్యేయమని వెల్లడించారు.

ఎన్నికల తనిఖీల్లో..

గత నవంబర్‌లో ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలను నిర్వహించామని ఎస్పీ వినీత్ తెలిపారు. ఈ క్రమంలో రూ.3,61,81,100 నగదు, రూ.3,79,200 విలువైన లిక్కర్ బాటిళ్లు (2,161 లీటర్లు), ఎన్నికల సంద ర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే అనుమానం ఉన్న 3,195 మందిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేశామని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈ ఏడాది జనవరి, డిసెంబర్ నెలల్లో రెండుసార్లు ముక్కోటి ఏకాదశి వేడు కలు జరిగాయని, అలాగే గత ఏప్రిల్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వ హించామని, ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత కేంద్రా లకు తరలించడం, వారికి పునరావాస చర్య లు చేపట్టడంలో పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేసిందని చెప్పారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చూశామన్నారు. ఇక ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసేలా భద్రత కట్టుదిట్టం చేశామని చెప్పారు. ప్రజా రక్షణే ధ్యేయంగా పోలీసు లు పని చేస్తున్నారని, శాంతిభద్రతల విష యంలో ప్రజలకు అన్ని విధాలా అండగా ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. విధి నిర్వహణలో తమ శాఖకు సహకరిం చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, వెంకటేష్, సైబర్ క్రైం డీఎస్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై నిఘా పెంచాం

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 80 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, వారు 43 కేసుల్లో నిందితులుగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. అరెస్టయిన వారిలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఒకరు, ఎల్‌ఓఎస్ కమాండర్లు ముగ్గురు, ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్ ఒకరు, ఎల్‌ఓఎస్ మెంబర్ ఒకరు, మావోయిస్టు పార్టీ సభ్యులు ముగ్గురు, డివిజనల్ కమిటీ సెక్రటరీ(ఎన్‌డీ) ఒకరు, మావోయిస్టు కొరియర్లు 34 మంది, మిలీషియా సభ్యులు 28 మంది, సానుభూ తిపరులు 8 మందిని అరెస్టు చేశామని వివ రించారు. మరో ఐదుగురు మావోయిస్టులు సరెండర్ అయ్యారని చెప్పారు. ఈ ఏడాది మొత్తంగా మావోయిస్టుల నుంచి ఒక ఎస్‌ఎల్ ఆర్, సింగిల్ షాట్ గన్ -1, తపంచా -1, రివాల్వర్ -1, ల్యాండ్ మైన్స్ 02, జిలెటిన్ స్టిక్స్ 142, డిటోనేటర్లు 532, కార్డెక్స్ వైర్ 375 మీటర్లు, కరపత్రాలు 234, సెల్‌ఫోన్‌లు 06, ఒక కారు, ఒక ట్రాక్టర్‌తో పాటు రూ.24,45,600 నగదు స్వాధీనం చేసుకున్నా మని వివరించారు. వారిపై నిఘా పెం చామని, కార్యకలాపాలు అదుపు చేయగ లిగామని చెప్పారు. ఈ విషయంలో పోలీస్ సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

చోరీ కేసులు.. రికవరీ

శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల ముందున్నారని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది 379 చోరీ కేసులు నమోదు, రూ.4,27,51,847 నగదు అపహరణకు గురైందని, అందులో 228 కేసుల్లో నిందితు లను గుర్తించి రూ.1,23,33,206 రికవరీ చేసి, బాధితులకు అందజేశామని వివరిం చారు. జిల్లా వ్యాప్తంగా 73 (ఎన్‌డీపీఎస్) గం జాయి అక్రమ రవాణా కేసులు నమోదు కాగా, రూ.11,62,13,175 విలువైన 4,734.007 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, తరలిస్తున్న 142 మందిని అరెస్టు చేసి జైలుకు పంపామని తెలిపారు. 2022లో 49 కేసుల్లో రూ.4,79,80,000 విలువైన 2,398.995 కేజీల గంజాయిని పట్టుకోగా, గతేడాది కంటే ఈ సంవత్సరం 24 కేసులు ఎక్కువగా నమోదయ్యాయని చెప్పారు. ఈ ఏడాది 138 సైబర్ నేరాల కేసు లు నమోదు కాగా, రూ.4,76,16,190 మేర బాధితులు నష్టపోయారని, ఇందులో రూ.91 వేలు బాధితులకు తిరిగి అప్పగించ గా. రూ.76,24,654 ఫ్రీజ్ చేసి ఉంచామని వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో పీడీ ఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు 64, గంజాయి కేసులు 73, ఇసుక అక్రమ రవాణా కేసులు 192 నమోదయ్యాయని, అందులో 187 ఇసుక కేసులను తహసీల్దార్లకు అప్పగిం చామని చెప్పారు. పిటీ కేసులు 12,880, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 14,629, ఈ-చలాన్ కేసులు 4,37,592 నమోదయ్యాయని పేర్కొ న్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న 29 మందిపై రౌడీషీట్ తెరిచామని, వీరు కాక అంతకుముందే 232 మంది రౌడీ షీటర్లు ఉన్నారని తెలిపారు.

క్లుప్తంగా

అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపిక

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారుడు రాష్ట్ర ఎస్జీఎఫ్ మెన్స్ అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన మన్విత్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో అత్యుతమ ప్రతిభ కనబరచగా, నిర్వాహకులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మన్విత్‌ను అకాడమీ కోచ్ లలిత్ సుకుమార్, తేజ, ఆనంద్ పాల్ తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుండాల: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాఠశాలలకు గైర్హాజరైన ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని చింతలపాటు, రోళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకాలేదని తెలిపారు. దీంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు ఆటోడ్రైవర్లపై కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: బస్సు డ్రైవర్‌పై దాడి ఘటనలో ఇద్దరు ఆటో డ్రైవర్లపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తగూడెం వన్ టౌన్ సీఐ ఎం.కరుణాకర్ కథనం ప్రకారం.. బుధవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ కంబం నాగరాజుపై ఇద్దరు ఆటో డ్రైవర్లు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్లు సర్వారానికి చెందిన ఇస్లావత్ విజయ్‌కుమార్, చుంచుపల్లి నందతండాకు చెందిన విజయ్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీ

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను డిప్యూటీ డెమో ఎండి ఫయాజ్ మొహిద్దీన్ గురువారం తనిఖీ చేశారు. కొత్తగూడెంలోని డాక్టర్ నాగరాజు ఆస్పత్రిలో రికార్డులను తనిఖీలు చేశారు. అర్హత కలిగిన వారు మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. అర్హతలేని వారితో వైద్య సేవలు అందిస్తే నోటీసులు ఇచ్చి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు నాగలక్ష్మి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


రాము (ఫైల్)


చంద్రుగొండ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దామరచర్ల గ్రామంలో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం .. దామరచర్ల గ్రామానికి చెందిన బన్నె రాము (30)కు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్లపాటు కాపురం సజావుగానే సాగింది. అనంతరం భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో, భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న రాము మద్యానికి బానిసయ్యాడు. తాను ఒంటరి జీవితం భరించలేనని చనిపోతానంటూ చెబుతుండగా, కుటుంబ సభ్యులు వారించేవారు. కాగా బుధవారం పొలంలో ఉన్న ట్రాక్టర్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి, రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. గురువారం గ్రామసమీపంలోని అటవీప్రాంతం వద్ద మృతదేహమై కన్పించాడు. మృతదేహం వద్ద మద్యం, పురుగుల మందు బాటిళ్లు పడి ఉన్నాయి. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాచినేని రవి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్యను హతమార్చిన భర్త

భూవిషయమై తప్పును నిలదీయడంతో ఆగ్రహం

ఖమ్మంక్రైం: పుట్టింటి వారు ఇచ్చిన భూమికి బదులు అదనంగా పాస్‌బుక్‌లో నమోదు చేయించుకోవడాన్ని తప్పుపట్టిన మహిళను ఆమె భర్త హత్య చేసిన ఘటన ఇది. ఖమ్మం టూటౌన్ సీఐ కుమారస్వామి కథనం ప్రకారం... ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు గ్రామానికి చెందిన రేణుక(45)ను నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన మొక్క కోటయ్య వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా వారికి సైతం వివాహాలయ్యాయి. ప్రస్తుతం కోటయ్య కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని బీసీ హాస్టల్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, దంపతులిద్దరు ఖమ్మం మామిళ్లగూడెంలో అద్దె గదిలో నివాసముంటున్నారు. కొంతకాలం క్రిందట రేణుక సోదరుడు అబ్బులయ్య ఆమెకు 20 కుంటల భూమిని ఇచ్చాడు. అయితే, కోటయ్య వారికి తెలియకుండా అదనంగా 1.01 కుంటల భూమిని తన పాస్ బుక్‌లో ఎక్కించుకున్నాడు. ఆలస్యంగా తెలుసుకున్న రేణుక ఇది అన్యాయమని, తన సోదరుడికి తిరిగి ఇవ్వాలని భర్తకు సూచించింది. కొన్నాళ్లుగా ఈవిషయమై వాదనలు జరుగుతున్నట్లు తెలుస్తుండగా, బుధవారం అర్ధరాత్రి దాటాక ఆగ్రహంతో కోటయ్య రేణుక చీరకొంగుతోనే ఉరి వేసి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం తమ బంధువులకు ఫోన్ చేసి ఆయన వెళ్లిపోగా, వారు రేణుక పుట్టింటి వారికి సమాచారం ఇచ్చారు. ఈమేరకు వారు గురువారం మామిళ్లగూడెం చేరుకునే సరికి రేణుక మృతిచెంది ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

ఆట ఆరంభం..

- రాష్ట్రస్థాయి గిరిజన బాలికల గురుకులాల క్రీడా పోటీలు ప్రారంభం
- నాలుగు జోన్ల నుంచి తరలివచ్చిన 1,200 మంది విద్యార్థినులు
- తొలిరోజు కబడ్డీ, పరుగుపందెం, షాట్‌పుట్ తదితర పోటీలు..
- ఇష్టంగా కష్టపడితేనే విజయం : డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: గిరిజన బాలికల గురుకులాల 7వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్ల నుంచి 1200 మంది క్రీడాకారిణులు, 80 మంది క్రీడా శిక్షకులతోపాటు అధికారులు తరలివచ్చారు. దీంతో ఆతిథ్య సుభాష్‌నగర్ గురుకుల కళాశాల మైదానం కోలాహలంగా మారింది. స్వాగత కార్యక్రమం అలరించింది. జాతీయ పతాకాలు చేబూని సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణులు క్రీడా జ్యోతిని వెలిగించి ప్రదర్శించారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఆదివాసీ, బంజారా సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ప్రారంభ పోటీగా వాలీబాల్‌ను గురుకులాల డిప్యూటీ సెక్రటరీ, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన రీజినల్ అధికారులు, ప్రధానాచార్యులు ఆడి సందడి చేశారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పలు క్రీడాంశాల్లో తలపడి, సత్తా చాటారు. మొత్తం నాలుగు రోజుల్లో 28 ఈవెంట్లలో పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఇష్టంగా కష్టపడితేనే..

రంగం ఏదైనా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇష్టంగా కష్టపడాలని గిరిజన గురుకులాల డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గురుకులాల్లో విద్యనందించడంతోపాటు సాంస్కృతిక, క్రీడా, మానసిక పరిపక్వత లక్ష్యంగా అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పలువురు గిరిజన బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. కేవలం చదువే ప్రామాణికంగా తీసుకుంటే భావి జీవితంలో అనేక మానసిక రుగ్మతలతో బాధపడతారనడంలో సందేహం లేదన్నారు. విద్యార్థి దశ నుంచే వ్యాయామం, వినూత్న అంశాలను ఆకలింపు చేసుకోవాలన్న ఆకాంక్ష, పోటీ తత్వం వంటివి అలవడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల ఓఎస్డీ శ్రీనివాసకుమార్, స్పోర్ట్స్ అధికారి రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటేశ్వర రాజు, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ శీలం ఉమ, క్రీడాశిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.


జాతీయ పతాకం చేబూని సంప్రదాయ వేషధారణలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థినులు


హోరాహోరీగా కబడ్డీ పోటీ..




ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేస్తున్న క్రీడాకారిణులు


పరుగుపందెంలో నువ్వా.. నేనా!

శ్రీరామ దీక్ష విరమణ

- గిరి ప్రదక్షిణ, రామయ్యకు వెండి రథోత్సవం
- పునర్వసు మండపంలో రాపత్తు సేవ


వెండి పాదుకలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న ఈఓ, మాలధారులు


రామయ్యకు వెండి రథ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం శ్రీరామ దీక్ష విరమణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈనెల 1న కార్తీక పునర్వసు సందర్భంగా రామమాల ధరించిన భక్తులు ఘనంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, కోలాటాల నడుమ ఈఓ రమాదేవి రామయ్య వెండి పాదుకలను తలపై ధరించగా అర్చకులు భద్రగిరి ప్రదక్షిణ గావించారు. అనంతరం బేడా మండపంలో ఇరుముడులకు ప్రత్యేక పూజలు, విరమణ చేశారు. సాయంత్రం స్వామివారికి వెండి రథ సేవను వైభవోపేతంగా జరిపించారు. కాగా, శుక్రవారం స్వామివారికి జరిగే పుష్యమి పట్టాభిషేకంలో పాల్గొనేందుకు మాలధారులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాపత్తు సేవ..

దేవస్థానంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గోదావరి ఒడ్డున ఉన్న పునర్వసు మండపంలో రాపత్తు సేవ జరిపారు. పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి హారతి సమర్పించారు.

ఆన్‌లైన్‌లో రామయ్య క్యాలెండర్లు..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో క్యాలెండర్లను రూపొందించారు. ఆలయ ప్రాంగణంలో ఇప్పటికే విక్రయాలు ప్రారంభం కాగా, దేవస్థానం వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచినట్లు ఈఓ రమాదేవి తెలిపారు. ఆన్‌లైన్‌లో ధర రూ.200 ఉందని, అన్ని ప్రాంతాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● సాదాసీదా 'గుమ్మడి'..


సాధారణ హోటల్‌లో టిఫిన్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ప్రస్తుత రోజుల్లో ఎమ్మెల్యేగా ఒకసారి గెలిస్తేనే హంగు, ఆర్భాటం ప్రదర్శిస్తారు. కానీ ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సాధారణ జీవనం గడుపుతున్నారు. ఐదుసార్లు గెలిచినా నిరాడంబరంగా జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం ఇల్లెందులోని కొత్త బస్టాండ్ ముందు ఓ సాధారణ హోటల్‌లో సాదాసీదాగా అల్పాహారం తింటూ కనిపించారు.

రూ. 2.50 లక్షల ఆస్తినష్టం


ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు

చర్ల: మండలంలోని సింగసముద్రంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన చెందిన ఇర్పా గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి చర్లలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. మధ్యాహ్నం వేళ ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు లేచాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో సామగ్రి సహా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇటీవల పత్తి, ధాన్యం విక్రయించగా వచ్చిన నగదు రూ.1.30 లక్షలతో పాటు ఇంట్లోని విలువైన సామగ్రి మొత్తం కాలి బూడిదయింది. సుమారు రూ 2.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన పాయం తులసీని కొంతకాలంగా ఆమె భర్త పాయం జనార్దన్‌రావు వేధిస్తున్నాడు. అతిగా మద్యం తాగి చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు...

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని గుంపెన శివారులో ఉన్న పేకాటస్థావరంపై గురువారం టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.18,790 నగదు, 5 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నలుగురు పరారయ్యారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై షాహీన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. ఇల్లెందు మండలం రొంపేడుకు చెందిన పాదెం సాయికృష్ణ, పాదెం అనూష, రాజమండ్రికి చెందిన ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై ఇల్లెందు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో ట్రాలీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి..

సుజాతనగర్: ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన సుజాతనగర్‌లో గురువారం రాత్రి జరిగింది. సుజాతనగర్‌కు చెందిన నవీన్ ఆటోలో స్థానిక హెచ్‌పీ బంకులో నుంచి బయటకు వస్తున్నాడు. అదే సమయంలో పాల్వంచకు చెందిన సురేష్ బైక్‌పై సుజాతనగర్ వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సురేష్ తీవ్రంగా గాయపడగా, కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

సుజాతనగర్: సర్వారంలో ప్రియుడు మోసం చేశాడంటూ ఓ యువతి అతడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు దమ్మపేట మండలానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించాడు. కొంతకాలం తర్వాత పెళ్లి గురించి అడిగితే ససేమిరా అన్నాడు. దీంతో ఆ యువతి దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పెళ్లి చేసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించాడు. కొంతకాలం గడువు కావాలని కోరాడు. ఇప్పుడు మళ్లీ పెళ్లికి నిరాకరించడంతో ఆ యువతి సర్వారంలో యువకుడి ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. ఈ సమయంలో ప్రియుడు ఇంటివద్ద లేకపోవడంతో అతడి కుటుంబ సభ్యులకు, యువతికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అతడి కుటుంబసభ్యులు తనపై దాడి చేస్తున్నారంటూ యువతి తీసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతేకాక యువతి 100కు ఫోన్ చేయగా విచారణకు వెళ్లిన పోలీసులు.. ఆందోళన విషయాన్ని యువకుడికి ఫోన్‌లో తెలిపారు. అయితే ఇప్పటికే తనపై దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉందని, శుక్రవారం అక్కడికి వెళతానని అతడు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

బైక్ అదుపు తప్పి..

వంతెనను ఢీకొని ఒకరు మృతి


ముత్యాలు(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన చప్పిడి ముత్యాలు(35) బుధవారం రాత్రి 11గంటల సమయంలో ద్విచక్రవాహనంపై నారాయణపురం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో నారాయణపురం–ఆసుపాక మధ్యలో మూలమలుపు వద్ద అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు అశ్వారావుపేట సీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఏసుమణి, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబీకులు నిరుపేదలు కావడంతో హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కొందరు దాతలు రూ.10వేల నగదు సాయాన్ని అందించారు. ఎస్ఐ పి.శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన టీచర్ మృతి

చర్ల: మండలంలోని కుదునూరు శివారులో బుధవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు అనంత వెంకటకృష్ణ (42) అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నర్సిరెడ్డి కేసు నమోదు చేశారు. వీరాపురానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటకృష్ణను కుదునూరు గ్రామానికి చెందిన ఇరకం వెంకటేశ్వర్లు అలియాస్ చిట్టిబాబు బైక్ ఢీకొట్టగా, ఇద్దరికీ గాయాలైన విషయం విదితమే.

చికిత్స పొందుతున్న మహిళ..

అశ్వారావుపేటరూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన దొడ్డాకుల శ్రీదేవి(40) అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి అశ్వారావుపేటకు వచ్చి పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య


కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. అనంతరం పీసీసీ సభ్యుడు నాగ సీతారాములుతో కలిసి కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సంబురాలు జరిపారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కాగా సబ్‌స్టేషన్ వద్ద, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌లో విగ్రహం వద్ద పార్టీ జెండాలను కొత్వాల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, ఎస్.ఎ.జలీల్, ముత్తయ్య, బాలినేని నాగేశ్వరరావు, మురళీ, కిశోర్, రాంబాబు, సోమయ్య, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో ప్రత్యేక చర్యలు

- ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామసభలు
- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు


అశ్వాపురం: గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వాపురం: ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన గ్రామ సభను గురువారం ఆయన సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి స్వీకరణ తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తులు పూర్తిచేసేందుకు అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. కాగా మండలంలో గురువారం అమ్మగారిపల్లి, ఆనందాపురం, తుర్రంవారిగూడెం, బట్టీలగుంపు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరన్న, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ చారి, అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురం, 19వ వార్డు గర్ల్స్ హైస్కూల్, 20వ వార్డు స్టేషన్ బస్తీలో జరిగిన గ్రామసభలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేసే దరఖాస్తు ఫారం నింపి ఆధార్, రేషన్ కార్డు జత చేసి అందజేస్తే సరిపోతుందని తెలిపారు. ఏ అపోహ ఉన్నా అధికారులు నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు అందజేశాక, రశీదు తీసుకోవాలని చెప్పారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం

ఎస్పీ డాక్టర్ వినీత్


గాంధీనగర్‌లో పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. 23 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 106 కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామసభల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

గాంధీనగర్‌లో పరిశీలన

పాల్వంచ: మున్సిపాలిటీలోని గాంధీనగర్‌లో ప్రజాపాలన సభను గురువారం ఎస్పీ డాక్టర్ వినీత్‌ను సందర్శించారు. కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ వివరాలను మున్సిపల్ ఏఈ రాజేష్ అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంకటేష్, ఎస్ఐ రాము తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శిల్పినగర్ కాలనీకి చెందిన యువకుడు శ్రీనివాసరావు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీయగా ఆచూకీ తెలియరాలేదు. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బూర్గంపాడు: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



సాక్షి,అమరావతి: టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజకీయాలు తన సెకండ్ ఇన్నింగ్స్ అని మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తెలిపారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటి నుంచి సీఎం జగన్ మీద మంచి అభిప్రాయం ఉందని, ఆయన కులమతాలు, రాజకీయాలతో పనిలేకుండా పారదర్శకంగా పాలన చేస్తున్నారని ప్రశంసించారు. అందుకే ఆయనకు మద్దతుగా గతంలో ట్వీట్లు పెట్టినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చాలా ఆరోపణలు చేశారని, అయితే ఇప్పుడు వారే అంతకంటే ఎక్కువ ఇస్తామని ఎలా చెప్తారని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాయుడు అన్నారు.

‘కెప్టెన్’ విజయకాంత్ కన్నుమూత

- విషాదంలో మునిగిన ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు
- ప్రధాని మోదీతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- నివాళులర్పించిన తమిళనాడు సీఎం స్టాలిన్
- నేడు చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనారోగ్యంతో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన డీఎండీకే అధ్యక్షుడు



చెన్నైలో విజయ్‌కాంత్ భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు బారులు తీరిన అభిమానులు

సాక్షి, చెన్నై: డీఎండీకే అధ్యక్షుడు, తమిళ సినీ నటుడు విజయకాంత్ (71) అనారోగ్యంతో కన్నుమూశారు. చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.10 గంటలకు తుది శ్వాస విడిచారు. ఈ సమాచారంతో ఆయన అభిమానులతోపాటు ఆ పార్టీ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. విజయకాంత్ మృతితో సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం 4.45 గంటలకు చెన్నై కోయంబేడులోని డీఎండీకే పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలో విజయకాంత్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తమిళనాడు రాజకీయాల్లో ప్రధాన పాత్రను పోషించిన, పోషిస్తున్న వారంతా సినీరంగానికి సుపరిచితులే అన్న విషయం తెలిసిందే. ఇందులో విజయకాంత్ కూడా ఒకరు. సినీ రంగంలో పురట్చి కలైంజ్ఞర్‌గా, కెప్టెన్‌గా పేరుగడించిన విజయకాంత్ 2005లో డీఎండీకే (దేశీయ ముర్పోగు ద్రావిడ కళగం) పార్టీ ఏర్పాటుతో రాజకీయాల్లోకి ప్రవేశించారు. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచే ప్రయత్నం చేసిన ఆయన తమిళ రాజకీయాల్లో ఓ ఆశాదీపంగా కనిపించారు.

మరణంతో విషాదం...

విజయకాంత్ గత నెలలో మూడు వారాలు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ సమయంలో అనేక వదంతులు వచ్చాయి. అయితే గత వారం జరిగిన డీఎండీకే పార్టీ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరుకావడంతో అభిమానులు, కేడర్‌లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రమంలో మళ్లీ అస్వస్థతకు గురికావడంతో మంగళవారం రాత్రి చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం కన్నుమూశారు. తొలుత ఆయన పార్థివ దేహాన్ని చెన్నై శాలిగ్రామంలోని నివాసంలో ఉంచారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌తోపాటు పలువురు ప్రముఖులు విజయకాంత్‌కు అంజలి ఘటించారు. అనంతరం కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయానికి భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. విజయకాంత్‌కు నివాళులర్పించేందుకు ప్రముఖులతోపాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు పార్టీల నేతలు, సినీ ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ప్రముఖుల సంతాపం

విజయకాంత్ మృతి పట్ల ప్రధాని మోదీ, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, పి.చిదంబరం, టీఎన్‌పీసీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, సినీనటుడు కమల్‌హాసన్‌తోపాటు పలు పార్టీల నేతలు సంతాపం వ్యక్తంచేశారు. ‘విజయకాంత్ మరణం నన్ను ఎంతగానో కలచివేసింది. తమిళ సినీ ప్రపంచంలో దిగ్గజమైన ఆయన లక్షలాది మంది అభిమానుల మనసు గెలుచుకున్నారు. రాజకీయ నేతగా ప్రజలకు ఎంతగానో సేవచేసిన ఆయన తమిళనాడు రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు’ అని మోదీ ‘ఎక్స్’లో పోస్టుచేశారు.

‘కరుప్పు ఎంజీఆర్’గా...

అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు దివంగత ఎంజీఆర్ ఆశయ సాధన నినాదం, ఆయనే ఆదర్శంగా రాజకీయాల్లోకి వచ్చిన విజయకాంత్ ‘కరుప్పు ఎంజీఆర్’ (నల్ల ఎంజీఆర్)గా గుర్తింపు పొందారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీచేయగా, తానొక్కడే గెలిచినా 8.2 శాతం ఓట్లు సాధించి తమిళ రాజకీయాల్లో కీలకంగా మారారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను గద్దె దింపాలన్న లక్ష్యంతో జయలలిత (అన్నాడీఎంకే).. విజయకాంత్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ 41 స్థానాల్లో బరిలో దిగగా, 29 చోట్ల గెలిచి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఎన్నికల్లో ఆ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పటివరకు అధికారంలో ఉన్న డీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. ఆ తదుపరి అసెంబ్లీ వేదికగా అన్నాడీఎంకే అధినేత్రి, సీఎం జయలలితతో తలెత్తిన విభేదాల కారణంగా విజయకాంత్ అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా ఉండేందుకు ఎన్‌డీఏ నేతృత్వంలోని కూటమిలో చేరారు. ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ ఒక్క స్థానంలోనూ గెలవకపోగా, ఓటు బ్యాంకు ఐదు శాతానికి పడిపోయింది. తర్వాత 2016 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్‌గా తన నేతృత్వంలోనే కూటమి ఏర్పాటు చేశారు. అందులో విజయకాంత్‌నే కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. కానీ, ఆ ఎన్నికల్లో డీఎండీకే ఒక్క సీటు కూడా గెలవకపోగా, 2.4 శాతం ఓట్లకే పరిమితమైంది. చివరకు రాష్ట్ర పార్టీ గుర్తింపు కూడా కోల్పోయింది. ఈ రెండు ఎన్నికలు నిరాశ పరిచినా, రాజకీయంగా వెనకడుగు వేయకుండా ముందుకు సాగిన విజయకాంత్‌ను తర్వాత అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో పార్టీని విజయకాంత్ సతీమణి ప్రేమలత తన భుజాన వేసుకుని నడిపిస్తున్నారు. పెద్దకుమారుడు విజయ ప్రభాకరన్ రాజకీయాల్లో, చిన్న కుమారుడు షణ్ముగపాండియన్ సినీ రంగంలో అడుగుపెట్టారు.

విజయరాజ్ నాయుడు...

విజయకాంత్ తమిళనాడులోని మదురైలో స్థిరపడ్డ తెలుగు సంతతికి చెందిన కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కేఎస్ అళగర్‌స్వామి, ఆండాళ్ అళగర్‌స్వామి. విజయకాంత్ అసలు పేరు విజయరాజ్ నాయుడు అన్న విషయం కొందరికే తెలుసు.

లోకేశ్‌కు నోటీసులు జారీచేయండి

- విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఆదేశం
- లోకేశ్ అరెస్ట్‌కు అనుమతించాలన్న ఏపీ సీఐడీ పిటిషన్‌పై విచారణ
- తదుపరి విచారణ జనవరి 9కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో చంద్రబాబుకు రిమాండ్ విధింపును తప్పుబట్టడంతోపాటు కీలక సాక్షులుగా ఉన్న అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేసిన నారా లోకేశ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం గురువారం ఆదేశించింది. లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై న్యాయస్థానం కీలక ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో 41ఏ నోటీసు కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ ఇటీవల పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది. గతంలో విధించిన ఆంక్షలను ఉల్లంఘించడంతోపాటు కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారించిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ అంశంలో లోకేశ్‌కు నోటీసులు జారీచేయాలని ఆదేశించింది. ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొనాలని తెలిపింది. ఈ కేసులో తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 9కు వాయిదా వేసింది.

రేపు రావాలని సీఐడీ అధికారులకు చెప్పిన లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది

టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న ఉన్నతాధికారులను బెదిరించే రీతిలో చేసిన వ్యాఖ్యలపై కోర్టు నోటీసులు అందించేందుకు వెళ్లిన సిబ్బందికి లోకేశ్ అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆయనకు నోటీసులు జారీచేయాలని విజయవాడ ఏసీబీ న్యాయ స్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు నోటీసులు అందించేందుకు సీఐడీ అధికారులు కృష్ణా కరకట్ట మీద ఉన్న నివాసానికి గురువారం వెళ్లారు. ఆ సమయంలో లోకేశ్ నివాసంలో ఉన్నా బయటకు రాలేదు. అధికారులు చాలాసేపు నిరీక్షించినా ఫలితం లేకపోయింది. నోటీసులు అందించేందుకు శుక్రవారం రావాలని లోకేశ్ వ్యక్తిగత సిబ్బంది చెప్పారు. దీంతో సీఐడీ అధికారులు నోటీసులు అందించకుండానే వెనుదిరిగారు.

విశ్వసనీయత చాటుకున్నాం

అవ్వాతాతలకు పెన్షన్ల పెంపు నుంచి అక్కచెల్లెమ్మలకు హామీలన్నీ పూర్తిగా నెరవేరుస్తున్నాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: అవ్వాతాతలకు పెన్షన్ల పెంపుతో పాటు అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేస్తూ ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశ్వసనీయతకు మారుపేరు అని మరోసారి రుజువు చేసుకుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదే సందేశాన్ని అవ్వాతాతలతో పాటు ప్రతి లబ్ధిదారుడికీ, ప్రతి గడప వద్దకు తీసుకెళ్లాలని అధికార యంత్రాంగానికి సూచించారు. జనవరిలో మూడు కార్యక్రమా లతో పాటు ఫిబ్రవరిలో ఒక కార్యక్రమం కలిపి మొత్తం నాలుగు ప్రధాన కార్యక్రమాలను తలపెట్టామని, వీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా బ్రహ్మాండంగా జరిగేలా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన విధంగా ప్రీ లాంచ్, లాంచ్, పోస్ట్ లాంచ్ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. జనవరి 1 నుంచి 8 వరకు ‘వైఎస్సార్ పెన్షన్ కానుక’ రూ.3 వేలకు పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని, రెండో కార్యక్రమంగా జనవరి 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, మూడోది జనవరి 23 నుంచి 31 వరకు ‘వైఎస్సార్ ఆసరా’ కార్యక్రమాన్ని తలపెట్టగా నాలుగో కార్యక్రమం ‘వైఎస్సార్ చేయూత’ ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు జరుగుతుందని జగన్ ప్రకటించారు. ఈ నాలుగు కార్యక్రమాలను ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధి కారులకు దీనికి సంబంధించి దిశానిర్దేశం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇవీ 4 కార్యక్రమాలు..

- జనవరి 1 – 8: వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు
- జనవరి 19: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ
- జనవరి 23 – 31: వైఎస్సార్ ఆసరా
- ఫిబ్రవరి 5 – 14: వైఎస్సార్ చేయూత

జిల్లా వార్తలు

రామయ్యను దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు జడ్జి



భద్రాచలంలోన్యాయమూర్తి దంపతులకు వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస హరీష్‌కుమార్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వారికి వేదాశీర్వచనంతో పాటు స్వామి వారి తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కూడా జడ్జి శ్రీనివాస హరీష్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తొలుత వారికి అర్చకులు, అలయ మర్యాదలతో స్వాగతం పలకగా ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పంచవటీ కుటీరం, నార చీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సీఐ దోమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సుల యజమానులను ఆదుకోండి



ఖమ్మం డీఎంకు వినతిపత్రం ఇస్తున్న అద్దెబస్సుల యజమానులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీకి అద్దె బస్సులను సమకూర్చిన యజమానుల సమస్యలు పరిష్కరించాలని ఖమ్మం రీజియన్ కమిటీ బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నకిరికంటి సత్యంబాబు, పి.రవి, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు చంద్ర రామకృష్ణ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలో ఆర్ఎం సీహెచ్.వెంకన్న, డిపో మేనేజర్ బి.శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు బస్సులో 50మంది నుండి 60 మంది వరకు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఫలితంగా డీజిల్ వాడకంలో తేడా వస్తుండగా, టైర్లపై భారం పడుతోందని తెలిపారు. ఈమేరకు ప్రస్తుతం చెల్లిస్తున్న అద్దెను మరో రూ.2పెంచాలని, బస్సులో సీట్ల సంఖ్య ఆధారంగా కాకుండా అందరితో పాటు బస్సుకు ఇన్సూరెన్స్ వర్తింపజచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ బాధ్యులు గోపాల్‌రెడ్డి, జగన్, రమేష్‌బాబు, నరేందర్, ప్రసాదరావు పాల్గొన్నారు.

భారజల కర్మాగారంలో ‘ఎమర్జెన్సీ’పై సమీక్ష

- అత్యవసర చర్యలను వివరించిన అధికారులు
- హాజరైన అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారంలో భారజలం ఉత్పత్తి సందర్భంగా విషవాయువు హైడ్రోజన్ సల్ఫైడ్ విడుదలైనప్పుడు చేపట్టే చర్యలపై ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ సమీక్ష గురువారం నిర్వహించారు. అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీ పర్ణశాల అతిథి గృహంలో గురువారం జీఎం ఎస్.జగ్గారావు అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటుచేయగా ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ డైరెక్టర్ హోదాలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు. ఈమేరకు ప్రమాదవశాత్తూ విషవాయువు విడుదలైతే భారజల కర్మాగారం పరిధిలోని గ్రామాల్లో యాజమాన్యం చేపడుతున్న చర్యలు, తీసుకునే ముందు జాగ్రత్త చర్యలు, ఉద్యోగుల విధులను సేఫ్టీ సూపరింటెండెంట్ యోహాన్, డిప్యూటీ ప్రొడక్షన్ మేనేజర్ వీరేంద్రనాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ఆతర్వాత విషవాయువు లీకైనప్పుడు నివారణకు ఉపయోగించే పరికరాలను అదనపు కలెక్టర్ పరిశీలించాక, పాములపల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారజల కర్మాగారం జీఎం జగ్గారావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా మాక్‌డ్రిల్ నిర్వహించడం ద్వారా స్థానికుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డీజీఎంలు ఘంటసాల శ్రీనివాసరావు, కోటిరెడ్డి, సీఈఓ వేణు, అధికారులు డాక్టర్ మనీష్ శ్రీవాత్సవ, తిరుమలరావు, ఉమాశంకర్, వెంకటేష్, లింగయ్య, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీకి మెజార్టీ పత్రాలు

- కొత్తగూడెంలో అందజేసిన డీవైసీఎల్సీ
- సింగరేణిలో పూర్తయిన గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ
- ఏఐటీయూసీకి 16,177, ఐఎన్‌టీయూసీకి 14,178 ఓట్లు



ఏఐటీయూసీ నాయకులకు మెజార్టీ పత్రం అందజేస్తున్న డీవైసీఎల్సీ శ్రీనివాసులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈమేరకు బుధవారం అర్ధరాత్రి వరకు అన్ని ఏరియాల ఫలితాలు వెల్లడి కాగా అత్యధిక మెజార్టీ సాధించిన ఏఐటీయూసీకి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(డీవైసీఎల్సీ) దేవరకొండ శ్రీనివాసులు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్తింపు పత్రాలను త్వరలోనే అందిస్తామని తెలిపారు. కాగా, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 39,733 ఓట్లలో 37,451 ఓట్లు పోల్ కాగా, ఐఎన్‌టీయూసీ ఆరు ఏరియాల్లో గెలిచింది. అయితే, అత్యధిక ఓట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)కి రావడంతో గుర్తింపు సంఘంగా ప్రకటించారు.

సంఘాల వారీగా ఓట్ల వివరాలు...

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)కి 16,177 ఓట్లు(43.20శాతం) ఓట్లు వచ్చాయి.
- గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ఈసారి ఆరు ఏరియాల్లో గెలవడమే కాక 14,178(37.86 శాతం) ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది.
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) 3,710 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది.
- 2012, 2017 ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ ఈ ఎన్నికల్లో ఏ ఒక్క ఏరియాలోనూ గెలవకపోగా, 1,298 ఓట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.
- సింగరేణి మినరల్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్ఎంఎస్) 947 ఓట్లు సాధించింది.
- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) 917 ఓట్లతో ఐదో స్థానంలో నిలిచింది. అయితే, గత ఎన్నికల్లో పోలిస్తే పుంజుకోవటమే కాక కార్పొరేట్ ఏరియాలో రెండో స్థానంలో నిలిచింది.
- గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్)(ఐఎఫ్‌టీయూ) 116 ఓట్లతో సరిపెట్టుకుంది.

ధ్యాన మందిరంలో విజయనగరం భక్తుల కచేరి

- రాముడు జన్మించిన పునర్వసు నక్షత్రం సందర్భంగా వేడుక
- 46మంది భక్తులచే నవరత్న కీర్తనల ఆలాపన



రామదాసు మందిరంలో కచేరీ నిర్వహిస్తున్న విజయనగరం భక్తులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని భక్త రామదాసు ధ్యాన మందిరంలో ఏపీలోని విజయనగరానికి చెందిన సుబ్బయ్య భక్తమండలి ఆధ్వర్యాన గురువారం కచేరీ నిర్వహించారు. శ్రీరాముడు జన్మించిన పునర్వసు నక్షత్రం రోజున రామాలయంలో కచేరీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా విజయనగరానికి చెందిన 46 మంది భక్తులు నవరత్న కీర్తనలు, రామదాసు గీతాలు ఆలపించగా మందిరం మార్మోగింది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో పునర్వసు నక్షత్రం సందర్భంగా 99 కచేరీ కార్యక్రమాలు నిర్వహించగా, 100వ కచేరీ రామదాసు జన్మస్థలంలో నిర్వహించటం సంతోషంగా ఉందని బృందం సభ్యులు తెలిపారు. మందిరం పూజారి సౌమిత్రి రమేష్‌కుమారాచార్యులు, భక్త రామదాసు విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు పెండ్యాల గోపాలకృష్ణమూర్తితో పాటు వెంకటలక్ష్మి, దివాకరం, సీతామహాలక్ష్మి, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి



విద్యార్థినులతో కలిసి పాఠం వింటూ...



భోజనం చేస్తూ విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

దుమ్ముగూడెం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహిస్తూ 10జీపీఏ వచ్చేలా తీర్చిదిద్దాలని తెలిపారు. దుమ్ముగూడెం మండలం రేగుబల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. తరగతి బోధనను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన భోజనం చేసి నాణ్యతను తనిఖీ చేశారు. ఆతర్వాత పీఓ ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ ద్వారా బోధించాలని, తద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించి ప్రతీరోజు కంప్యూటర్ తరగతులు బోధించాలని పీఓ ఆదేశించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల్లో ఎస్సెస్సీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునివ్వాలని పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో దమ్మపేట డివిజన్ హెచ్ఎం, వార్డెన్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు పాఠాలు బోధించాలని, వెనుకబడిన వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, చంద్రమోహన్, అలివేలు మంగతాయారు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోపాలపుట్టగా నూతన విద్యావిధానం



సదస్సులో మాట్లాడుతున్న దినేష్ సిరంగరాజ్, పక్కన నాయకులు

ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో అనేక లోపాలు ఉన్నాయని.. నూతన విధానం పేరుతో అనాగరిక చర్యలను తెరపైకి తీసుకొస్తున్న ప్రభుత్వ తీరును అందరూ ఖండించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ సూచించారు. ఖమ్మంలో గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న విద్యావిధానాలు విద్యార్థులకు భవిష్యత్‌ను నిర్దేశించేలా ఉండాలే తప్ప సంకెళ్లుగా మారొద్దని పేర్కొన్నారు. నూతన విద్యావిధానం పేరిట కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు కొనసాగుతున్న విధానానికి స్వస్తి పలికి అంతకంటే అనాగరిక విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ అందుకు తగినట్లు విధానం లేదని తెలిపారు. నూతన విద్యా విధానాన్ని విరమించుకోని పక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సి వస్తుందని దినేష్ హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ నాయకుడు పోటు ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ కుట్ర పూరితంగా తీసుకొచ్చిన విద్యావిధానంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదస్సులో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు ఇటికాల రామకృష్ణ, రఘురాం, గ్యార క్రాంతి, రెహమాన్, సి.రాజు, ఎన్.సత్య, బి.సంతోష్, హరీష్, అజిత్, పార్థసారథి, లోకేష్, ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.